సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023



విలేజ్ క్లినిక్‌ల సేవలు సద్వినియోగం

విలేజ్ హెల్త్ క్లినిక్‌ల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఉన్నతాధికారులు సూచించారు

8లో



అటవీ హక్కు చట్టాలపై అవగాహన అవసరం

అటవీ చట్టాలపై అవగాహన అవసరమని డీఎఫ్‌వో కొండలరావు సూచించారు.

8లో



ఏఎస్పీ ఆకస్మిక తనిఖీ

జడ్డంగి స్టేషన్‌ను రంపచోడవరం ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు.

8లో

న్యూస్‌రీల్

చిన్న పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు

రంపచోడవరం: ఏజెన్సీలో అర్హులైన యువతకు చిన్న పరిశ్రమలశాఖ ద్వారా రుణాలు మంజూరు చేస్తామని ప్రాజెక్టు అధికారి సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం వెలుగు సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 8వ తరగతి పాస్ అయిన వారి దగ్గర నుంచి ఆపై చదువుకున్న యువత చిన్న పరిశ్రమల ఏర్పాటుకు రుణం పొందవచ్చన్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అర్హులకు రాయితీపై రుణాలు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఏజెన్సీలోని అన్ని గ్రామాల్లో వివిధ రకాల వ్యాపారాలు చేసుకునే వారంతా దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన సూచించారు. డీపీఎంలు పరమేశ్వరరావు, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

చిరుత సంచారంతో గుబులు



చిరుత పాతముద్రలను సేకరిస్తున్న అటవీశాఖ అధికారులు

రంపచోడవరం: రంపచోడవరానికి సమీపంలోని ముసురుమిల్లి ప్రాజెక్టు ముంపు ప్రాంతమైన సీతపల్లి గ్రామ సమీపంలో చిరుత పులి సంచారం గిరిజనుల్లో గుబులు పుట్టిస్తోంది. ముసురుమిల్లి ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో చిరుతతో పాటు దాని పిల్ల సంచరిస్తున్నట్టుగా అటవీ అధికారులు గుర్తించారు. వాటి పాదముద్రల సేకరణ చేపట్టారు. ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. చిరుత సంచారంపై చుట్టుపక్కల గ్రామాల్లో ఆందోళన నెలకొంది.ఈ సందర్భంగా అటవీ రేంజర్ కరుణాకర్ మాట్లాడుతూ అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చిరుత సంచారంపై నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పాము కాటుకు గిరి మహిళ మృతి



దేవలక్ష్మి మృతదేహం

జి.మాడుగుల: అడవి నుంచి వంట చెరకు తెస్తుండగా మార్గం మధ్యలో పాము కాటుకు గురైన గిరి మహిళ మృతి చెందింది. మండలంలో బొయితిలి పంచాయతీ చాపగెడ్డ గ్రామానికి చెందిన కొర్రా దేవలక్ష్మి(45) తన పిల్లలతో సోమవారం మధ్యాహ్నం సమీపంలో అటవీ ప్రాంతానికి వంట చెరకు నిమిత్తం వెళ్లింది. తిరిగి అదేరోజు సాయంత్రం కట్టెల మోపుతో ఇంటికి వస్తుండగా మార్గం మధ్యలో పాము కాటుకు గురైంది. వెంటనే అపస్మారక స్థితికి చేరడంతో వెంటనే పిల్లలు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి వెళ్లేసరికి నురగలు కక్కుతూ అప్పటికే మృతి చెందింది. ఆమెకు నలుగురు సంతానం. వారంతా గుండెలవిసేలా రోదించారు.

శాంతి భద్రతల పరిరక్షణ అందరి బాధ్యత

ఎస్పీ సతీష్‌కుమార్



టూరిజం పోలీస్ స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో ఎస్పీ సతీష్‌కుమార్

అరకులోయ రూరల్: శాంతి భద్రతల పరిరక్షణ అందరి బాధ్యత అని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన కేంద్రాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన టూరిజం పోలీస్ స్టేషన్లను వర్చువల్ విధానంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒకేసారి ప్రారంభించారని ఆయన తెలిపారు. దీంట్లో భాగంగా గిరిజన మ్యూజియం అవరణలో ఏర్పాటైన టూరిజం పోలీసుస్టేషన్‌ను స్థానికంగా ఎస్పీ ప్రారంభించారు. అనంతరం ఆయన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన టూరిజం పోలీసుస్టేషన్ వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగమన్నారు. నిరంతరం సిబ్బంది అందుబాటులో ఉంటూ అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తారన్నారు. కమ్యూనికేషన్ డీఎస్పీ శ్యామల, అరకు సీఐ జీడిబాబు, ఎస్‌ఐ సంతోష్ పాల్గొన్నారు.

గిరి ఉత్పత్తులకు విశ్వఖ్యాతి

గిరిజనులకు గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా తమ ఉత్పత్తులకు విశ్వఖ్యాతి లభించేలా గిరిజన సహకార సంస్థ చర్యలు చేపట్టింది. నాణ్యమైన ఉత్పత్తులను అందుబాటులో ఉంచుతూ వినియోగదారులకు మరింత చేరువవుతోంది. ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై కూడా దృష్టి పెట్టి వ్యాపారాన్ని మరింత విస్తరిస్తోంది.

- గిరిజనులకు గిట్టుబాటు ధర
- వినియోగదారులకు నాణ్యమైన సరకులు
- ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై దృష్టి
- వ్యాపార రంగంలో దూసుకుపోతున్న గిరిజన సహకార సంస్థ



పర్యాటక ప్రాంతాల్లోని అవుట్‌లెట్లలో అందుబాటులో ఉన్న జీసీసీ ఉత్పత్తులు

అనంతగిరి: గిరిజనుల ఆర్థికాభివృద్ధికి గిరిజన సహకార సంస్థ బాటలు వేస్తోంది. అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవించే వారిని దళారీ వ్యవస్థనుంచి కాపాడేందుకు ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటోంది. గిరిజనుల నుంచి తేనె, చింతపండు, పసుపు, కుంకుమ, కాఫీ తదితర 27 రకాల ఉత్పత్తులను కొనుగోలు చేసి, వాటిని ప్రాసెసింగ్ చేసి మార్కెట్లోకి అందుబాటులోకి తెచ్చింది.

నాణ్యమైన బ్రాండింగ్‌పై..

నాణ్యమైన బ్రాండింగ్‌పై కూడా జీసీసీ దృష్టిసారించింది. ఆన్‌లైన్‌లో అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసేలా జీసీసీ ఛైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి ప్రత్యేక దృష్టిపెట్టారు. ఇప్పటికే ఫ్లిప్‌కార్ట్, తదితర వాటితో మాట్లాడారు. దీంతో పాటు పర్యాటకులకు సౌకర్యార్థం పర్యాటక ప్రాంతాల్లో అవుట్‌లేట్లను ఏర్పాటుచేయడం ద్వారా వ్యాపారం పెరిగింది.



బొర్రాలోని జీసీసీ అవుట్‌లెట్‌ను పరిశీలిస్తున్న జీసీసీ మేనేజర్ దుర్గాప్రసాద్

సేంద్రియ ఉత్పత్తులు..

కల్తీలేని ఆహారంపై ప్రతి ఒక్కరూ దృష్టిసారించారు. ఆరోగ్యకరమైన ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. అందుకు తగ్గట్టుగా ఏజెన్సీలో గిరిజనులనుంచి సేంద్రియ ఉత్పత్తులను సేకరించి విక్రయిస్తోంది.

పర్యాటక ప్రాంతాల్లో అవుట్‌లెట్లు

బొర్రా గుహలు, అరకు, డుంబ్రిగుడ, చింతపల్లి, తదితర పర్యాటక ప్రాంతాల్లో అవుట్‌లెట్లు ఏర్పాటు చేసింది. పర్యాటకులు సౌకర్యార్థం నాణ్యమైన జీసీసీ అటవీ ఉత్పత్తులను అందుబాటులో ఉంచింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటుగా వివిధ దేశాల నుంచి వచ్చే వారు వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

వారపు సంతల్లో..

అరకు–విశాఖ ప్రధాన అనుకుని ఉన్న అనంతగిరి, కాశీపట్నం, సుంకరమెట్ట, అరకు, జి.మాడుగుల, చింతపల్లి, వారపు సంతల్లో సైతం గిరిజన సహకార సంస్థ స్టాళ్లను ఏర్పాటుచేసి ఉత్పత్తులను విక్రయిస్తోంది.

నిరుద్యోగులకు ప్రోత్సాహం

నిరుద్యోగులు అటవీ ఉత్పత్తుల స్టాళ్ల ఏర్పాటుకు ముందుకు వస్తే వారికి 15 శాతం తగ్గించి అందిస్తుంది. ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం కల్పిస్తోంది.

తిరుమల తిరుపతి దేవస్థానానికి..

వీలైనంత ఎక్కువగా గిరిజన ఉత్పత్తుల్ని తిరుమల తిరుపతి దేవస్థానానికి అందించేందుకు జీసీసీ అధికారులు ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగానే ఇప్పటికే ఇన్‌స్టెంట్ కాఫీ పొడితో పాటు కుంకుడు పొడిని సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే 3 వేల టన్నుల కుంకుడు పొడిని టీటీడీ కొనుగోలు చేసింది. ఈ పొడిని దేవస్థానంలో ఉన్న విగ్రహాలు, స్వామివారి నైవేద్యం తయారు చేసే పాత్రలతో, పూజలో వినియోగించే పాత్రల్ని శుభ్రం చేసేందుకు సేంద్రియ పద్ధతిలో తయారు చేసిన స్వచ్ఛమైన కుంకుడు పొడిని ఉపయోగిస్తున్నారు.

మరింత బలోపేతం



పర్యాటకులు, వినియోగదారులు సౌకర్యార్థం పర్యాటక ప్రాంతాలతో పాటు, అరకు–విశాఖ ప్రధాన రహదారిలో అవుట్‌లెట్లను ఏర్పాటుచేశాం. దీనివల్ల వ్యాపారం పెరిగింది. మరింత పెంచే దిశగా ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నాం.

– దుర్గాప్రసాద్, జీసీసీ మేనేజర్, కాశీపట్నం బ్రాంచ్

నాణ్యమైన ఉత్పత్తులే లక్ష్యం



గిరిజనులు సేకరించిన నాణ్యమైన అటవీ ఉత్పత్తులను వినియోగదారులకు అందించడమే లక్ష్యంతో పనిచేస్తున్నాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో జీసీసీని మరింత బలోపేతం చేయడంతోపాటు గిరిజనుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నాం. ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై దృష్టి పెట్టాం.

– శోభ స్వాతిరాణి, జీసీసీ ఛైర్‌పర్సన్

పీవీటీజీల జీవనంపై అధ్యయనం

వివరాలు తెలుసుకున్న మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్‌ఎఫైర్స్ బృందం సభ్యులు



గలగండలో పీవీటీజీ గిరిజనులతో మాట్లాడుతున్న అధ్యయన బృందం సభ్యులు

ముంచంగిపుట్టు: పీవీటీజీ గిరిజనుల జీవన విధానంపై అధ్యయనం చేసేందుకు మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి చెందిన మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్ సెక్షన్ అధికారి కమరాజ్ మాలిక్‌తో కూడిన బృందం పర్యటించింది. మండలంలోని పెదగూడ పంచాయతీ గలగండ, జర్రిపడ పీవీటీజీ గ్రామాలను సందర్శించింది. వీరికి గిరిజనులు ఘన స్వాగతం పలికారు. బృందం సభ్యులు పీవీటీసీ గిరిజనులతో సమావేశమయ్యారు. వారి జీవన విధానం, స్థితిగతులు, ఆచార వ్యవహారాల వివరాలను తెలుసుకున్నారు. భాష, వ్యవసాయం, సాగు చేసే పంటలు, అటవీ ఉత్పత్తుల సేకరణ, పూజించే దేవతల వివరాలు, కాలానుగుణంగా వచ్చిన మార్పులను బృందం సభ్యులు తెలుసుకున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల కల్పన, ప్రభుత్వ రాయితీలపై ఆరా తీశారు. అధ్యయన నివేదికను రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అందజేయనున్నట్టు బృందం సభ్యులు తెలిపారు. గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు, కమ్యూనిటీ భవనాల నిర్మాణంతోపాటు పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పెదగూడ సర్పంచ్ బాబూరావు, స్థానిక గిరిజనులు బృందం సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ టీసీఆర్‌టీఎం ఈడీ జి.చిన్నబాబు, ఐటీడీఏ పీటీజీ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీటీజీ గణపతి, వెలుగు ఏపీఎం దేవమంగ, సీడీపీవో రాజేశ్వరి, ఏపీవో సూరిబాబు, ఈవోపీఆర్డీ చిన్నాన్న తదితరులు పాల్గొన్నారు.

అడవికి నిప్పు

ఆకతాయిల చేష్టలతో విలువైన సంపదకు నష్టం



పాడేరు ఘాట్‌లో కోమాలమ్మతల్లి ఆలయ మలుపు వద్ద వ్యాపించిన మంటలు

సాక్షి,పాడేరు: ఘాట్‌రోడ్డులో కొంతమంది ఆకతాయిలు ఎండిన ఆకులకు మంగళవారం నిప్పు పెట్టడంతో అడవిలో మంటలు వ్యాపించాయి. గరికబంద నుంచి ఏసు ప్రభువు విగ్రహం ఉన్న మలుపు వరకు రోడ్డుకు ఇరువైపులా విలువైన చెట్లు దగ్ధమయ్యాయి. 12వ మైలు రాయి నుంచి మోదకొండమ్మ పాదాలు గుడి వరకు ఏపీఎఫ్‌డీసీకి చెందిన విలువైన కాఫీతోటలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో మంటలు వ్యాపిస్తే కాఫీతోటలన్నీ అగ్నికి ఆహుతయ్యే ప్రమాదం ఉంది.అటవీశాఖ విభజనలో మొత్తం ఘాట్‌రోడ్డు ప్రాంతమంతా పాడేరు అటవీశాఖ డివిజన్ పరిధిలోకి వచ్చింది. పాడేరు ఘాట్‌రోడ్డులో అటవీశాఖ అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగులు తనిఖీలు చేపట్టి, ఆకతాయిల చేష్టలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యా విధానం భేష్

విద్య పరిశోధన శిక్షణ సంస్థ కోఆర్డినేటర్ రాంకిషోర్



బోధన మెటీరియల్ వివరాలను తెలుసుకుంటున్న బృందం సభ్యులు

అరకులోయ రూరల్: జిల్లాలో విద్యా బోధన విధానం చాలా బాగుందని విద్య పరిశోధన శిక్షణ సంస్థ (న్యూఢిల్లీ) బృందం కోఆర్డినేటర్ రాంకిషోర్ పేర్కొన్నారు. మంగళవారం అయన నేతృత్వంలో 28 మందితో కూడిన బృందం సభ్యులు జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ ఆధ్వర్యంలో పర్యటించారు. దీనిలో భాగంగా యండపల్లివలస, గురుకులం, కంఠభంసుగూడ గిరిజన సంక్షేమ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లతో చేస్తున్న డిజిటల్ బోధన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బృందం కోఆర్డినేటర్ రాంకిషోర్ మాట్లాడుతూ విద్యాబోధన విధానం చాలా బాగుందని ప్రశంసించారు. ఇటువంటి విద్యావిధానం ఇతర రాష్ట్రాల్లో కూడా అమలుచేస్తే బాగుంటుందన్నారు. పాఠశాలల్లో బోధన మెటీరియల్‌ను పరిశీలించారు. పాఠశాలల ఆవరణలో బృందం సభ్యులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో భారతిరత్నం, గురుకుల ప్రిన్సిపాల్ ధర్మ, హెచ్‌ఎం ధయనిధి, ఉపాధ్యాయులు సత్యనారాయణ,బొంజిబాబు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలు వేగవంతం

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని రోడ్ల నిర్మాణాలన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని మారుమూల ఐనాడ పంచాయతీలో మంగళవారం ఆయన పర్యటించారు. పూలగరువు గ్రామానికి రూ.12 లక్షల సీసీడీపీ నిధులతో నిర్మించిన సీసీరోడ్డును పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.రోడ్డుకు ఇరువైపులా మట్టితో బెర్ములు నిర్మించాలని ఆయన ఆదేశించారు. రోడ్ల నిర్మాణాలన్ని నాణ్యతగా నిర్మించి, పదికాలాల పాటు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.అనంతరం పూలగరువు గ్రామంలోని గిరిజనులతో పీవో సమావేశమయ్యారు. గ్రామంలో సమస్యలు తెలుసుకున్నారు. గ్రావెటీ తాగునీటి పథకం అందుబాటులో ఉందని, అదనంగా బోరుబావి నిర్మించాలని గిరిజనులు పీవోను కోరారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ఈఈ డీవీఆర్‌ఎం రాజు, డీఈఈ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల వైద్యానికి పెద్దపీట

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం,ఆదిలక్ష్మి, త్రిపర్ణ



అరకులోయ ఆస్పత్రిలో బాలుడితో మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు

అరకులోయ రూరల్: చిన్నారుల వైద్యానికి ప్రభుత్వం పెదపీట వేసిందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం, ఆదిలక్ష్మి త్రిపర్ణలు అన్నారు. మంగళవారం వారు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. సదరం ధ్రువీకరణ పరీక్షలు, వైద్యం పొందుతున్న చిన్నారుల వివరాలను వారు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో చిన్నారుల వైద్యానికి పెదపీట వేసిందన్నారు. విస్తృతంగా వైద్యశిబిరాలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పౌష్టికాహార లోపంతో ఉన్న పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించే దిశగా కృషి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ సిబ్బంది విధులపట్ల నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. శిశు మరణాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. పిల్లలకు రక్త హీనత సమస్య తలెత్తకుండా పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. అంగన్‌వాడీలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు జిల్లా అధికారి సూర్యలక్ష్మి, బాలల హక్కుల పరిరక్షణ జిల్లా అధికారి రమేష్, వైద్యాధికారి హరి, సీడీపీవో శారద, జిల్లా కన్వీనర్ లవకుశ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రులు 2,87,258

- ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల తుది జాబితా ప్రకటన
- ఓటర్లలో పురుషులే అధికం

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాను ప్రకటించారు. తుది ఓటర్ల నమోదు కార్యక్రమం సోమవారంతో ముగియగా.. మంగళవారం నాటికి మొత్తం ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో 2,87,258 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్లు జాబితా సవరణ ప్రక్రియ పూర్తి కావడంతో తుది ఓటర్ల జాబితా ప్రకటించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీకు వచ్చే నెల 13న ఎన్నికలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. మొత్తం 2,87,258 మంది ఓటర్లలో పురుషులు 1,80,891, మహిళలు 1,06,329, ట్రాన్స్‌జెండర్లు(టీజీ) 38 మంది ఉన్నారు.

జిల్లాల వారీగా ఓటర్ల వివరాలివీ..

జిల్లా పేరు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు
శ్రీకాకుళం	36,361	15,830	05	52,196
విజయనగరం	38,556	19,817	09	58,382
పార్వతీపురం మన్యం	12,399	5,959	02	18,360
అల్లూరి సీతరామరాజు	7,894	3,674	03	11,571
విశాఖపట్నం	58,105	47,117	13	1,05,235
అనకాపల్లి	27,576	13,932	06	41,514
మొత్తం	1,80,891	1,06,329	38	2,87,258

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

నోడల్ అధికారులకు కలెక్టర్ మల్లికార్జున ఆదేశం



ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున



స్వర్ణభారతిలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవో, ఏపీవోలకు శిక్షణ తరగతులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎస్డీసీలు తదితరులు పాల్గొన్నారు.

- ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులకు సూచించారు. విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఆర్వోలతో ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ నెల 16 నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ ప్రారంభం కానుందన్నారు. నామినేషన్ ప్రక్రియలో ఎటువంటి అవంతరాలు ఎదురుకాకుండా చూడాలన్నారు.
- స్వర్ణభారతి స్టేడియంను మంగళవారం కలెక్టర్ మల్లికార్జున సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ ఏర్పాట్లు, ఎన్నికల సామగ్రి పంపిణీ కౌంటర్లు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలన్నారు. డీఆర్వో, ఆర్డీవోతో పాటు ఎస్‌డీసీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, రెవెన్యూ, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

నోడల్ అధికారుల నియామకం

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లాలో నోడల్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో.. వివిధ విభాగాలను ఈ నోడల్ అధికారులు పర్యవేక్షించనున్నారు.

- ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు(ఎంసీసీ), లా అండ్ ఆర్డర్, డిస్ట్రిక్ట్ సెక్యూరిటీ ప్లాన్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్: కె.వి.రామలక్ష్మి, ఎస్‌డీసీ, భూసేకరణ విభాగం సింహాచలం, దేవస్థానం–99852 92437
- ఎన్నికల కమిషన్‌కు నివేదిక అందజేత/ మీడియా సెల్‌కు సమాచారం: ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్‌డీసీ, ఎన్‌హెచ్ 16– 94411 40194, సీహెచ్ వి.రమేష్, ఎస్‌డీటీ, ఎన్‌హెచ్ 16
- 98499 11018, బి.వి.ఎల్.ఎన్.మూర్తి, ఎస్‌డీటీ కో–ఆర్డినేషన్(హెచ్)–98495 30239, జె.వి.ఎస్ చంద్రశేఖర్, జేఏ– ఎ సెక్షన్–83411 84778
- హెల్ప్ డెస్క్: ఎం.సత్య పద్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(కె.ఆర్.ఆర్.సి)– 9100 064971
- హెల్ప్ లైన్, ఫిర్యాదులు, మోనటరింగ్, కమ్యూనికేషన్ ప్లాన్: ఎస్.హెచ్.పాషా, అసిస్టెంట్ డైరెక్టర్ ఐఓఎస్– 82478 25057, జె.వి.ఎస్ చంద్రశేఖర్, జె.ఎ, అడ్మిన్ సెక్షన్– 83411 84778
- మెన్ పవర్ మేనేజ్ మెంట్: ఎల్.చంద్రకళ, డీఈవో – 98499 09103, ఆర్.విజయకుమార్, డిస్ట్రిక్ట్ సర్వే, లాండ్ రికార్డ్స్– 98661 69313
- ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్: జి.రాజారత్నం, డీటీసీ– 99846 61742, అప్పలనాయుడు, రీజనల్ మేనేజర్, ఆర్టీసీ– 99592 24529
- ట్రైనింగ్ మేనేజ్‌మెంట్: డి.హుస్సేన్ సాహెబ్, విశాఖ ఆర్డీవో– 98499 03825, భీమిలి తహసీల్దార్ కె.వేణుగోపాల్ – 80082 05734, ఎస్.హెచ్.పాషా, ఎన్ఐసీ అసిస్టెంట్ డైరెక్టర్– 82478 25057, సీహెచ్ అశోక్, ఈడీఎం 98662 25633
- మెటీరియల్ మేనేజ్‌మెంట్: జె.మాధవి, జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్– 93981 19866
- అబ్జర్వర్లు: డి.హుస్సేన్ సాహెబ్, ఆర్డీవో, ఎస్.వెంకటేశ్వర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, టి.ఆనందకుమార్, తహసీల్దార్, మహారాణిపేట– 9440151095
- బ్యాలెట్ పేపర్స్/పోస్టల్ బ్యాలెట్ పేపర్లు: డి.హుస్సేన్ సాహెబ్, ఆర్డీవో, జె.వి.ఎస్.ఎస్ రామ్మోహనరావు, స్టీల్‌ప్లాంట్ ఎస్‌డీసీ– 98499 03829
- మీడియా కమ్యూనికేషన్: వి.మణిరామ్, సమాచార శాఖ ఉప సంచాలకుడు– 91212 15253
- కంప్యూటరైజేషన్: ఎంజీ చంద్రశేఖర్, ఎన్ఐసీ డీఐవో– 94929 25474
- బ్యాలెట్ బాక్స్ నిర్వహణ: డి.సత్యనారాయణ, సీఈవో, జిల్లా పరిషత్– 91547 98982, పి.వి.వి.ఎన్ మూర్తి, ఏవో(ప్లానింగ్), జిల్లా పరిషత్– 63037 15547, వి.శ్యామ్ ప్రసాద్, తహసీల్దార్, సీతమ్మధార– 99498 67842

క్లుప్తంగా

350 లీటర్ల పులుపు ధ్వంసం



ధ్వంసం చేసిన పులుపు

జి.మాడుగుల: మండలంలో పెదలువ్వాసింగి పంచాయతీ చిలకపాలెం గ్రామంలో సారా తయారీ కేంద్రంపై మహిళా పోలీస్, గ్రామ వలంటీర్లు దాడి చేసి పులుపును ధ్వంసం చేశారు. చిలకపాలెం గ్రామంలో సారా తయారీ చేస్తున్నట్టు అందిన సమాచారం మేరకు దాడి చేసి, 350 లీటర్ల పులుపును ధ్వంసం చేసినట్టు మహిళా పోలీస్ శ్యామల, వలంటీర్ కర్రినాయుడు చెప్పారు.

300 కిలోల గంజాయి పట్టివేత



పోలీసుల అదుపులో నిందితులు

మోతుగుడెం: పోలీసను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డబ్బగూడెం జంక్షన్ వద్ద మంగళవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 300 కిలోల గంజాయిని తరలిస్తున్న ముఠాను గుర్తించి పట్టుకున్నట్టు మోతుగుడెం ఎస్ఐ యాదగిరి తెలిపారు. ఈ దాడిలో రెండు మహీంద్రా ఎక్స్‌యూవీ వాహనాలతో పాటు 12 ప్లాస్టిక్ సంచుల్లో ఉంచిన 300 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకునట్లు ఆయన చెప్పారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన రాజు కస్యప్, తనపాడై , సాదన్ సర్కార్‌లను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వీరందరూ ఒడిసా రాష్ట్రానికి చెందిన వారని చెప్పారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. 9 లక్షలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ పట్టాభి, హెచ్‌సీ సత్తిబాబు, పీసీలు మురళీకృష్ణ, సన్యాసిరావు ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- ఉమ్మడి విశాఖలో 207 కేంద్రాలు ఏర్పాటు
- విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు
- ఈ నెల 20 నుంచి పరీక్షలు ఆరంభం
- అధికారులతో డీఆర్‌వో శ్రీనివాసమూర్తి సమీక్ష



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న డీఆర్‌వో శ్రీనివాసమూర్తి

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి తెలిపారు. పరీక్షల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభమవుతున్నందున సంబంధిత విభాగాల అధికారులంతా కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు అవసరమైన బస్సులను అందుబాటులో ఉంచాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షలు జరిగే రోజుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అత్యవసర సమయంలో తగిన వైద్యం అందించేందుకు అవసరమైన ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖాధికారులకు సూచించారు. తాగునీటి సదుపాయం, శానిటేషన్ పనులను ఎప్పటికప్పుడు నిర్వహించేలా జీవీఎంసీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంబంధిత విభాగాల అధికారులంతా సమన్వయంతో పని చేసి, ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు పూర్తయ్యేందుకు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

నైతిక విలువల పరీక్ష నేడు

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా బుధవారం ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో ఉమారాణి తెలిపారు. అదేవిధంగా ఈ నెల 17న ఎన్విరాన్మెంటల్ పరీక్ష ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని, వార్షిక పరీక్షలకు నమోదు చేసుకున్న విద్యార్థులంతా తప్పనిసరిగా వీటికి హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు వారు చదువుకున్న కాలేజీల్లోనే పరీక్ష రాసే అవకాశం ఉందని ఆమె తెలిపారు.

207 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు

ఈ నెల 20 నుంచి మార్చి 7 వరకు జరిగే ప్రాక్టికల్స్ పరీక్షలకు విశాఖలో 126, అనకాపల్లిలో 65, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 16 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 20 నుంచి ఒకేషనల్ కోర్సు, 26 నుంచి జనరల్ కోర్సులకు చెందిన విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని 355 జూనియర్ కాలేజీల్లో చదువుతున్న బైపీసీ విద్యార్థులు 16,439 మంది, ఎంపీసీ గ్రూపు నుంచి 4,840 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో విశాఖ, అనకాపల్లి డీవీఈవోలు రాయల సత్యనారాయణ, బి.సుజాత, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం పడి విద్యార్థిని మృతి



మృతి చెందిన విద్యార్థిని దన్విత

హుకుంపేట: విద్యుత్ స్తంభం పడి విద్యార్థిని మృతి చెంది, మరో విద్యార్థినికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో తాడిపుట్టు పంచాయతీ ఉగ్రాడ బొడ్డాపుట్టు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాడు–నేడు పనులు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఆరుబయట విద్యాబోధన నిర్వహిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో పాఠశాల పక్కన ఉన్న జీలుగు చెట్టు విద్యుత్ తీగలపై పడడంతో నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. పాఠశాలకు ముందు ఉన్న స్తంభం విరిగి ఆరుబయట విద్య అభ్యసిస్తున్న ఆరో తరగతి చదువుతున్న తూబురు దన్విత తలపై పడింది. మరో విద్యార్థిని నిహారిక నడుముపై పడింది. దీనిని గమనించిన గ్రామస్తులు వెంటనే విద్యార్థులను హుకుంపేట ఆస్పత్రికి తరలించారు. అప్పటికే దన్విత మృతి చెందినట్టు వైద్యాధికారులు తెలిపారు. మరో విద్యార్థినికి తీవ్ర గాయాలు కావడంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్దకు చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎంఈవో రామచంద్రరావు, ఎంపీడీవో వెంకటరావు బొడ్డాపుట్టు పాఠశాల వద్దకు చేరుకుని సంఘటనను పరిశీలించారు. ఎస్ఐ సతీష్ ఆస్పత్రి వద్దకు చేరుకుని వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు. విద్యార్థి మృతికి కారకులైన ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని, తమకు న్యాయం చేయాలని హుకుంపేట ఆస్పత్రిలో మృతుని తల్లిదండ్రులు ఆందోళన చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అటవీ హక్కు చట్టాలపై అవగాహన అవసరం

డీఎఫ్‌వో కొండలరావు

అరకులోయ రూరల్: అటవీహక్కుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డీఎఫ్‌వో కొండలరావు సూచించారు. మండలంలో కొత్తవలస హెచ్ఎన్‌టీసీ ఉద్యానవనంలో పాడేరు ఐటీడీఏ సహకారంతో మంగళవారం అటవీహక్కుల చట్టం 2006, రాష్ట్ర స్థాయి సామర్థ్యాల పెంపుదలపై గిరిజన ప్రాంతాల్లోని 8 ఐటీడీఏల పరిధిలోని గిరి రైతులు, ప్రజాప్రతినిధులకు ఏర్పాటుచేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోడు, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యం కల్పిస్తున్నారన్నారు. ప్రతి రైతు చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే సమస్యలు సత్వర పరిష్కారం సాధ్యపడుతుందన్నారు. గిరిజనులు అడవిపై ఆధారపడి నప్పుడు వాటి పరిరక్షణకు కూడా బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. అప్పుడే మంచి ఫలితాలతోపాటు ఫలసాయం పొందవచ్చన్నారు. ఉన్న చెట్లను పరిరక్షించి విస్తృతంగా మొక్కల నాటితేనే పర్యావరణం మెరుగుపడుతుందన్నారు. అటవిని పోడు వ్యవసాయం కోసం నరకడంవల్ల దాని ప్రభావం పర్యావరణంపై చూపుతుందన్నారు. అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి, హుకుంపేట జెడ్పీటీసీ మత్స్యలింగం, వివిధ ప్రాంతల రైతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విలేజ్ క్లినిక్‌ల సేవలు సద్వినియోగం

డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లయ్య

చింతూరు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య సూచించారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా వైద్యసిబ్బంది మంగళవారం చింతూరులో ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 రకాల పరీక్షలతో 67 రకాల మందులతో వైద్యసేవలు హెల్త్ క్లినిక్‌ల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ క్లినిక్‌ల ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ ఆధ్వర్యంలో నెలకు రెండుసార్లు 104 వాహనాల ద్వారా వైద్యశిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులతో మోటారు సైకిల్ వద్దు, సైకిల్ ముద్దు అనే నినాదాలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ కారం కన్నారావు, వైద్యాధికారులు ఉదయ్‌కుమార్ రెడ్డి, నిఖిల్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



అమ్మవారిని దర్శించుకుంటున్న ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని మాకవరం పంచాయతీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన గంగమ్మ తల్లి ఉత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గిరిజనులతో కలిసి థింసా నృత్యం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ గ్రామ దేవతల పండగలను ఆచార వ్యవహారాలు పాటిస్తూ నిర్వహించాలని, రానున్న తరాలకు గిరిజన సంస్కృతి ఒక ఆదర్శంగా నిలవాలని, గిరిజన సంప్రదాయాలు పాటిస్తూ ముందుకు సాగాలన్నారు. మాకవరంలో నిర్వహించే అమ్మవారి ఉత్సవాలను పూర్వీకులకు సూచించిన నియమ నిబంధనలు పాటిస్తూ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. సర్పంచ్‌లు గంగాధరం, నీలకంఠం, రమేష్, నర్సింగరావు, భాగ్యవతి, నోయిన, ఎంపీటీసీ సభ్యులు కమల, సుబ్బలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు జగబందు, తిరుపతి, మూర్తి, కొండలరావు, దశరథ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీ ఆకస్మిక తనిఖీ

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి సర్కిల్‌లోని జడ్డంగి స్టేషన్‌ను రంపచోడవరం ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి రోడ్డు ప్రమాదాల నివారణ, స్టేషన్ పరిసరాల్లో రక్షణపరమైన అంశాలపై జడ్డంగి ఎస్ఐ షరీఫ్, రాజవొమ్మంగి ఎస్ఐ గోపీ నరేంద్ర ప్రసాద్, సిబ్బందికి సూచనలిచ్చారు. తరచు వాహనాల తనిఖీ చేపట్టి, నిబంధనలు పాటించని వారికి ఒకటి రెండుసార్లు కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. అప్పటికి వారిలో మార్పు రాకపోతే కేసులు నమోదు చేయాలని, అపరాధ రుసుములు విధించాలని ఆదేశించారు. స్పందన కౌంటర్‌లో రికార్డులు పరిశీలించారు. ఔట్‌పోస్టు (చెక్‌పోస్టు) పనితీరుపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న క్రైం కేసుల జాబితా పరిశీలించారు. స్టేషన్‌లోని పోలీసు అధికారులు, సిబ్బంది యోగక్షేమాలు అడిగి తెలుసుకొన్నారు. అంతకు ముందు ఆయన విలేకరులతో మాట్లాడుతు గంజాయి సాగు, రవాణా, అక్రమ వ్యాపారాలను సమూలంగా అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకొంటున్నామని ఏఎస్పీ అభిరామ్‌సింగ్ రాణా అన్నారు. తరచూ సారా కేసులో పట్టుబడిన వారిపై పీడీ యాక్ట్ ప్రకారం చర్యలు ఉంటాయన్నారు.

సెపక్ తక్రా క్రీడాకారుల ఎంపిక నేడు

దేవరాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో సెపక్ తక్రా క్రీడాకారుల ఎంపికను పెదనందిపల్లిలో బుధవారం నిర్వహించనున్నట్టు స్థానిక ఇన్‌చార్జ్ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు సీహెచ్. వెంకటరెడ్డి, ఎ.శేఖర్, పి. సూరిబాబు తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, అండర్–17 విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలను నిర్వహించి క్రీడాకారుల ఎంపిక చేస్తామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరవుతారన్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ నెల 19 నుంచి 21 వ తేదీ వరకు అనంతపురం జిల్లాలో జరిగే అంతర్‌జిల్లాల పోటీల్లో వీరు పాల్గొంటారని ఆయన చెప్పారు.

బండరాళ్లపై మెట్ల నిర్మాణం

రూ.30 వేలతో నిర్మించిన ఆలయ అభివృద్ధి కమిటీ

సాక్షి ఎఫెక్ట్..



మత్స్యగుండంలో నిర్మించిన సిమెంటు మెట్లు

సాక్షి,పాడేరు: ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రం మత్స్యగుండంలో బండరాళ్లపై సిమెంటు మెట్ల నిర్మాణాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ చేపట్టింది. మత్స్యగుండంలో మత్స్యదేవతల దర్శనానికి భక్తులు పడుతున్న ఇబ్బందులపై గత నవంబర్ నాలుగో తేదీన ఇంకెన్నాళ్లిలా..శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమవడంతో స్పందించింది. సుమారు రూ.30వేల వ్యయంతో మత్స్యగుండంలోని బండరాళ్లపై సిమెంట్ ప్లాట్‌ఫారంతో పాటు మెట్లు నిర్మించడంతో సమస్య పరిష్కారమైంది.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

రంపచోడవరం: ఆన్‌లైన్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని వెలుగు ఏపీఎంలను మహిళా సంఘాల లీడర్లను ఆర్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శరత్ చంద్ర కోరారు. ఐటీడీఏ సమావేశపు హాలులో మంగళవారం వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి బ్యాంకులో అకౌంట్ తప్పకుండా కలిగి ఉండాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు అర్హులైన లబ్ధిదారుల అకౌంట్‌ల్లో జమవుతాయన్నారు. సంపాదించిన డబ్బులో కొంత పొదుపు చేసుకుంటే భవిష్యత్‌లో ఉపయోగపడుతుందన్నారు. ఖాతాదారుల సిబిల్ స్కోరు ఆధారంగా బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తారని తెలిపారు. ఆర్‌బీఐ అనుమతితో నిర్వహిస్తున్న బ్యాంకుల్లో మాత్రమే రుణాలు తీసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ యాప్‌ల రుణాలు తీసుకోవద్దని సూచించారు. వెలుగు ఏపీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా అవగహన కలిగి ఉండాలని తెలిపారు. లీడ్ బ్యాంకు మేనేజర్ రవితేజ మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రతి మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక క్రమ శిక్షణపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వివిధ వ్యాపారులకు అవసరమైన రుణాలు మంజూరుకు బ్యాంకు మేనేజర్లతో మాట్లాడి మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. రీజనల్ బ్యాంకు నోడల్ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలకు చెక్‌పెట్టేందుకు అవగాహనతో మెలగాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో ఓటీపీ షేర్ చేయవద్దన్నారు. డీపీఎం పరమేశ్వరరావు, అపర్ణ, రామరాజు, యూబీఐ మేనేజర్ రాజ్‌కిషోర్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

మాకవరపాలెం: షార్ట్ సర్క్యూట్ కారణంగా కారు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా కాలిపోయింది. కోటవురట్లలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈగా పనిచేస్తున్న గెద్దం కరుణ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఓ అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఈమె కారును నిత్యం ఇంటి ముందే పార్కింగ్ చేస్తారు. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి ఒక్కసారిగా కారు ముందు భాగం నుంచి మంటలు చెలరేగాయి. విశాఖ–నర్సీపట్నం ప్రధాన రహదారి పక్కనే కారు దగ్ధం అవుతుండడంతో గమనించిన స్థానికులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక వాహనంతో సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజారావు

పెదబయలు: కాకినాడ ఆయిల్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు పరామర్శించారు. పర్రెడ, బొండాపల్లి పంచాయతీల పరిధిలోని లక్ష్మీపురం, వంచేడిపుట్టు, చంపాపుట్టు గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించి బాధిత కుటుంబాలను ఓదార్చారు. కూలీల వలసబాట లేకుండా గ్రామాల్లోని ఉపాధి పనులు కల్పించాలని, గిరిజన రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. బీఎస్పీనాయకులు చిన్నయ్యదొర, సింహాచలం ఉన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలకు పాల్పడితే చర్యలు



ములియగుడలోని అటవీశాఖ స్థలంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

అనంతగిరి: మండలంలోని టోకూరు పంచాయతీ ములియగుడలోని గ్రామంలోని 13/1 సర్వే నంబర్‌లో అటవీశాఖ రేంజ్ కార్యాలయం, ఉద్యోగులకు నివాస గృహాల నిర్మాణానికి, రెండు ఎకరాల స్థలాన్ని రెవెన్యూశాఖ అధికారులు కేటాయించారు. అటవీశాఖ కేటాయించిన స్థలంలోని మంగళవారం ఫారెస్ట్ సెక్షన్ అధికారి సీతారాం, సిబ్బందితో కలిసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికులు ధర్మ తదితరులు పాల్గొన్నారు.

భార్యా పిల్లలు అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు



ఆచూకీ తెలియని వెంకటలక్ష్మి, పిల్లలు

పాయకరావుపేట: గజపతినగరం గ్రామానికి చెందిన బడే తాతారావు అనే వ్యక్తి తన భార్య, పిల్లలు కనిపించడం లేదని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ ఎస్.రమేష్ తెలిపారు. తాతారావు భార్య వెంకటలక్ష్మి, పిల్లలు భవానీ ప్రసాద్, రమ్యలు ఈ నెల 9వ తేదీ నుంచి కనిపించడం లేదని తెలిపారన్నారు. 9వ తేదీన ఎస్.నర్సాపురం పాఠశాలకు పిల్లల్ని పంపించి, తర్వాత తల్లి వెంకటలక్ష్మి పాఠశాలకు పిల్లల దగ్గరకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి ఇంతవరకు కనిపించలేదన్నారు. వారి కోసం బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఆచూకీ తెలియరాలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

దాడిలో గాయపడిన యువకుడి మృతి

పాత కక్షలతోనే చంపారని మృతుడి తల్లి ఫిర్యాదు



హత్యకు గురైన దంటు ప్రవీణ్‌కుమార్ (ఫైల్)



దాడి జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రవీణ్‌కుమార్

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు జంక్షన్ సమీపంలో మద్యం దుకాణం వద్ద సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో దాడికి గురైన యువకుడు దంటు ప్రవీణ్‌కుమార్(23) అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందినట్టు నక్కపల్లి సీఐ నారాయణరావు మంగళవారం తెలిపారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొరుప్రోలు గ్రామానికి చెందిన దంటు ప్రవీణ్‌కుమార్, అదే గ్రామానికి చెందిన చొప్పా రమణ కుమార్తెను ప్రేమించడంతో ఉద్దేశపూర్వకంగా చొప్పా రమణ ప్రవీణ్‌కుమార్‌ను హత్య చేశాడని మృతుడి తల్లి దండు సత్య ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. 8 నెలలు క్రితం చొప్పా రమణకు, తన కుమారుడు ప్రవీణ్‌కుమార్‌తో గొడవ అయ్యిందని, అప్పటి నుంచి తమ కుమారుడిని చంపుతామని బెదిరించేవాడన్నారు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి పెదగుమ్ములూరు మద్యం దుకాణం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేశారని, రక్తపు మడుగులో ఉన్న తమ కుమారుడిని స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రాణాలు దక్కలేదని వాపోయిందన్నారు. చొప్పా రమణ పాత గొడవలు మనసులో పెట్టుకుని తన కొడుకుని అత్యంత దారుణంగా కత్తితో నరికి, కత్తి అక్కడే వదిలి పరారైనట్టు మద్యం దుకాణం వద్ద చూసిన వారి ద్వారా తెలిసినట్టు చెప్పిందన్నారు. చొప్పా రమణపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరినట్టు చెప్పారు. కాగా నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలాన్ని మంగళవారం పరిశీలించారన్నారు. నిందితులను పట్టుకుని అరెస్టు చేస్తామని చెప్పారు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ప్రజా రవాణా శాఖ స్థలాల్లో అభివృద్ధిపై సదస్సు

అనకాపల్లిటౌన్: అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ)కి చెందిన ఖాళీ స్థలాల్లో పబ్లిక్, ప్రైవేటు పార్టనర్‌షిప్(పీపీపీ) పద్ధతిలో అభివృద్ధిపై స్థానిక జిల్లా శాఖ కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి కె.పద్మావతి మాట్లాడుతూ అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పాడేరు డిపోల్లో ఖాళీస్థలాలను ప్రైవేటువ్యాపారులకు లీజుకిచ్చి అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన 20 మంది వ్యాపారవేత్తల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ అధికారులు కె.అప్పలనాయుడు, వెంకటరావు, డిపో మేనేజర్ సుజాత పాల్గొన్నారు.